సాక్షి
మహబూబాబాద్

బుధవారం | 4 | అక్టోబర్ | 2023



గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి - 8లో▸

అర్చకులు గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలని దేవాదాయశాఖ వరంగల్ జోన్ ఉపకమిషనర్ శ్రీకాంతారావు తెలిపారు.



కేయూలో బంద్ ప్రశాంతం

విద్యార్థి జేఏసీ ఇచ్చిన కేయూ బంద్ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. వీసీ రమేశ్‌ను బర్తరఫ్ చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.3^0 /27.9^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

డీఎస్పీ విచారణ



దోర్నకల్: పాతదోర్నకల్‌లోని హిజ్రా ఇంట్లో వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటనపై మంగళవారం మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ విచారణ జరిపారు. హిజ్రా దుర్గ ఇంట్లో అమ్మపాలెం గ్రామానికి చెందిన నవీన్ కత్తిపోట్లకు గురై ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందిన విషయం విదితమే. కాగా హిజ్రా దుర్గ ఇంటిని పరిశీలించిన డీఎస్పీ సమీప ఇళ్లల్లో నివాసం ఉండేవారిని ఘటనపై విచారణ జరిపారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. డీఎస్పీ వెంట దోర్నకల్, మహబూబాబాద్ రూరల్ సీఐలు బి.ఉపేందర్ రావు, రమేష్, రూనీస్ ఉన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



మహబూబాబాద్: దివ్యాంగులు మనోధైర్యం కోల్పోకుండా అన్ని రంగాల్లో రాణించాలని, దివ్యాంగురాలైన భాగ్య రాష్ట్ర, జాతీయ స్థాయిలో తెలంగాణ ప్యారా సిట్టింగ్ వాలీబాల్ కెప్టెన్ వ్యవహరిస్తుందని, ఆమెను దివ్యాంగులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం గూడూరు మండల కేంద్రానికి చెందిన భాగ్యకు న్యూ మోడల్ జర్మనీ రైట్ లెగ్ చికిత్స కోసం తన సీడీఎఫ్ నిధుల నుంచి రూ 2.60 లక్షల మంజూరు చేసి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రియాంక, నాయిని రంజిత్, సుదగాని మురళి, మందుల రఘు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



దోర్నకల్: త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఏఓ మురళీమోహన్, సీఐ బి.ఉపేందర్‌రావు దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని భవనాలతో పాటు ఇతర వసతులను అధికారులు పరిశీలించారు.

న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని పెంపొందించాలి



మహబూబాబాద్ రూరల్: పీపీలు, పోలీసులు సంయుక్తంగా కృషిచేసి న్యాయవ్యవస్థ ఔన్నత్యాన్ని మరింత పెంపొందించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయ సంచాలకురాలు (డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్) వైజయంతి అన్నారు. బాలుడు కుసుమ దీక్షిత్ రెడ్డి హత్యకేసులో నిందితుడు మంద సాగర్‌కు ఉరిశిక్ష పడగా.. అందుకు ఉత్తమంగా విధులు నిర్వర్తించిన పీపీలు, పోలీసు అధికారులు, సిబ్బందిని మంగళవారం హైదరాబాద్‌లో అభినందించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కుసుమ దీక్షిత్ రెడ్డి హత్య కేసులో పోలీసులు, ప్రాసిక్యూషన్ న్యాయవాదుల టీం వర్క్ అభినందనీయమన్నారు. ఇతర కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా పని చేయాలని సూచించారు. ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించి కేసుల పరిష్కారం పురోగతిలో విజయం సాధించాలన్నారు. డీడీపీ సత్యనారాయణ, జిల్లా కోర్టు పీపీ చిలకమారి వెంకటేశ్వర్లు, ఏపీపీ గణేష్ ఆనంద్, అప్పటి టౌన్ సీఐ (ప్రస్తుత నర్సంపేట సీఐ) సుంకరి రవికుమార్, పీసీలు అంబటి కుమార్, జక్కుల లింగన్న, తప్పెట్ల శ్రీకాంత్ తదితరులను రాష్ట్ర ప్రధాన న్యాయ సంచాలకులు వైజయంతి అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు.

ఓపీ కష్టాలు

గంటలకొద్ది నిరీక్షిస్తేనే చీటీ

- మానుకోట ఆస్పత్రిలో అన్ని సేవలకు ఒకటే క్యూ
- నిండు గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు తప్పని తిప్పలు
- విసుగెత్తి ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్న రోగులు

‘మహబూబాబాద్ మండలం జమాండ్లపల్లి గ్రామానికి చెందిన అన్వర్ కడుపు నొప్పితో బాధపడుతూ మంగళవారం ఉదయం 10గంటలకు మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. నొప్పి బాగా ఉందని బతిమిలాడినా డాక్టర్లు చూడలేదు.. ఓపీ చీటీ తీసుకొస్తేనే చూస్తామని తేల్చిచెప్పారు. 11:30 దాటినా ఓపీ చీటీ దొరక్కపోవడంతో బిడ్డ పడుతున్న బాధను చూడలేక తల్లి రంజాన్‌బీ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లింది.’



మహబూబాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో క్యూకట్టిన రోగులు

సాక్షి, మహబూబాబాద్: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు సమయానికి వైద్య సేవలు అందడం లేదు. ఆస్పత్రి వచ్చిన రోగుల వివరాలను ఒకేచోట ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం ఓపీ చీటీ ఇస్తారు. కాగా అందరూ ఒకే లైన్‌లో నిలబడి ఓపీ చీటీ తీసుకోవడంలో ఆలస్యమవుతోంది. దీంతో గంటల తరబడి క్యూలో నిలబడలేక కొందరు.. అత్యవసర వైద్యం కావాల్సిన వారు.. ఎండలో నిలబడలేక కొందరూ ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. ఇదిలా ఉండగా అత్యవసరం మీద డాక్టర్ వద్దకు వెళ్తే ఓపీ చీటీ ఉంటేనే చూస్తానని తిరిగి పంపిస్తున్నారు. దీంతో డాక్టర్లపై రోగులు, ప్రజలు మండిపడుతున్నారు.

ఆలస్యమైతే అంతే..

ఉదయం కాస్త ఆలస్యంగా ఆస్పత్రికి వస్తే అంతే సంగతులు. మధ్యాహ్నం 12గంటల వరకు కూడా ఓపీ చీటీ దొరకదు. దీంతో అప్పటికే ప్రధాన డాక్టర్లు వెళ్లిపోతారు. అక్కడ ఉన్న డ్యూటీ డాక్టర్లు పరీక్షించి.. పెద్ద డాక్టర్‌కు చూపించాలి.. మరుసటి రోజు రండి అంటూ.. పంపిస్తున్నారు. దీంతో ఆస్పత్రికి ఉదయాన్నే వచ్చి ఓపీ చీటీ కోసం లైన్‌లో నిల్చుంటున్నారు.

రోజు 600వరకు ఓపీ..

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు, ప్రమాదాలబారిన పడిన వారు,క్రిమి సంహారక మందు తాగిన వారితోపాటు సాధారణ జ్వరం, కడుపు నొప్పితో వచ్చేవారు సైతం క్యూలో నిలబడాల్సిందే. ఆస్పత్రికి సోమవారం , సెలవులు ఉన్న రోజుల్లో 800 నుంచి 900 వరకు, మిగితా రోజుల్లో 600 మేరకు ఓపీ ఉంటుంది. వీరందరూ ఒకే క్యూలో నిలబడి ఓపీ చీటీ తీసుకోవాల్సి వస్తోంది. ఉదయం వచ్చిన రోగులు మధ్యాహ్నం వరకు క్యూలో ఉంటున్నారు. ఇలాంటి ఇబ్బందులు పడలేక ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ప్రైవేట్ బాట..

అత్యవసర చికిత్స, వృద్ధులు, గర్భిణులకు కూడా ఓపీ త్వరగా రాయకపోవడంతో విసుగెత్తి పలువురు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వేలకువేలు ఖర్చు చేసి వైద్యం చేయించుకుంటున్నారు. కాగా ప్రభుత్వ ఆస్పత్రిలో ఇబ్బందులను పసిగట్టిన పలు ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు ఏజెంట్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రి నుంచి రోగులను తమ ఆస్పత్రులకు వచ్చేలా ఏజెంట్ల ద్వారా పురామాయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిలో భాగంగా ఓపీ చీటీలు ఆలస్యంగా ఇస్తున్నారని ఫిర్యాదులు కూడా అందాయి. కాగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న పలువురు వైద్యులు తమ సొంత క్లినిక్‌లకు రోగులను మళ్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గర్భిణులు కూడా గంటల కొద్ది నిలబడితేనే..



గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, అత్యవసర వైద్యం కావాల్సిన వారు కూడా గంటల తరబడి క్యూలో ఉండాలి. వీరి బాధను చూసినా పట్టించుకునేవారు లేరు. పెద్దసార్లు స్పందించి గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

– తిరుపతమ్మ, బయ్యారం

క్యూలో నిలబడలేక ప్రైవేట్‌కు వెళ్లా



జ్వరం వచ్చింది.. నీరసంగా ఉంది. ఆస్పత్రిలో చూపించుకుందామని వచ్చాను. గేటు వరకు ఉన్న క్యూ చూసి నీరసం ఎక్కువైంది. ఎండలో నిలబడే ఓపిక లేదు. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్న.

– యాకూబ్, మహబూబాబాద్

మానుకోటలో స్టీల్ బ్యాంక్

- మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్లాస్టిక్ నివారణ.. పర్యావరణ పరిరక్షణే లక్ష్యం
- ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలు స్టీల్ పాత్రల అద్దె
- మహిళా సంఘాల సభ్యులకు జీవనోపాధి



స్టీల్ బ్యాంక్‌లో మహిళా సంఘం సభ్యులు

మహబూబాబాద్: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంక్(బర్తన్‌బ్యాంక్) ఏర్పాటు చేశారు. మానుకోట మున్సిపాలిటీలో మహిళా సంఘాల సభ్యులు నిర్వాహకులుగా స్టీల్ బ్యాంకు నెలకొల్పి స్టీల్ పాత్రలు అద్దెకు ఇస్తున్నారు. దీంతో ప్లాస్టిక్‌రహితంగా పెళ్లిళ్లు, ఇతర వేడుకలు నిర్వహించే అవకాశం ఉంది.

అద్దెకు పాత్రలు..

మున్సిపాలిటీలోని వెల్పులసత్యంనగర్‌కాలనీలో నవ భారత్ పట్టణసమాఖ్య ఆధ్వర్యంలో ఇల్లు అద్దెకు తీసుకొని రూ.1.80లక్షలతో స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. దీనిని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు. దీనిలో టెంట్‌హౌస్ సమాన్లు, ప్లాస్టిక్ డిస్పోజబుల్, ఇతర ప్లాస్టిక్ వస్తువులకు స్థానం లేదు. కేవలం స్టీల్ పాత్రలు మాత్రమే ఏర్పాటు చేశారు. వాటిని అద్దెకు ఇస్తూ జీవనోపాధి పొందుతున్నారు. డోర్ డెలివరీ కూడా చేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీ లక్ష్యంగా మరికొన్ని స్టీల్ బ్యాంక్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణకు కృషి

పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నివారణ, ఇతర విషయాలను పరిగణనలోకి తీసుకుని స్టీల్ బ్యాంక్‌లు ఏర్పాటు చేయిస్తున్నాం. ప్రస్తుతం ఒకటి ఏర్పాటు చేశాం. దీంతో మహిళలకు జీవనోపాధి లభిస్తుంది. ప్రజలకు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించి స్టీల్ బ్యాంకులకు ఆదరణ పెరిగేలా చూస్తాం. భవిష్యత్‌లో మరిన్ని స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేస్తాం.

– విజయ, మెప్మా డీఎంసీ

అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

మహబూబాబాద్ అర్బన్: నేటి యువత, విద్యార్థులు అంబేడ్కర్ స్ఫూర్తితో ముందుకెళ్లాలని, దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సన్యాసయ్య, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎర్రయ్య, విద్యుత్‌శాఖ అధికారి నరేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మినీ నందన గార్డెన్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అభ్యుదయ ఆర్ట్ అకాడమి, బహుజన సాంస్కృతిక చైతన్య యాత్ర సంఘం కళాకారులు అంబేడ్కర్ జీవితం, ఆశయం ఇతివృత్తంగా ‘సంఘం శరణం గచ్ఛామి’ అనే దృశ్య నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అంబేడ్కర్ కన్న కలలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ విత్తల సుధాకర్, పలు సంఘాల నాయకులు సంజీవ, కన్న, కిషన్ నాయక్, లక్ష్మణ్ నాయక్, శ్రీనివాసులు, వీరన్న, రాంమూర్తి, మహేష్, శశి, సాయి, ఐలేష్, సూర్యప్రకాష్ నాయక్, పలు వసతి గృహాల వార్డెన్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

లైసెన్స్ రద్దు..



సైలెన్సర్ తొలగించిన బుల్లెట్ బైక్



ద్విచక్ర వాహనంపై వెళ్తున్న నలుగురు యువకులు

- వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే అంతే సంగతులు
- భయాందోళన కలిగించే సైరన్లతో బుల్లెట్ బండ్లు
- ఎంవీ యాక్ట్‌ను పక్కాగా అమలు చేస్తామంటున్న ఆర్టీఏ

మహబూబాబాద్ అర్బన్: డుగ్‌డుగ్‌డుగ్ అంటూ బాంబులు పేలిన శబ్దాలతో బుల్లెట్ బండ్లు ఒకవైపు.. కుయ్‌కుయ్‌మంటూ వీఐపీ హారన్లతో సాధారణ కార్లు మరోవైపు. ఇలాంటి మితిమీరిన, ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో రోడ్డెక్కాలంటేనే జనం జంకుతున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా బండ్లు నడిపే వాహనదారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ రద్దయ్యాక వాహనం నడిపితే జైలుకు పంపిస్తామని పేర్కొంటున్నారు.

భయం భయం..

ప్రస్తుతం బుల్లెట్ ద్విచక్రవాహనాల వాడకం ఎక్కువైంది. స్థాయితో సంబంధం లేకుండా యువత ఇష్టపడి కొనుగోలు చేస్తున్నారు. షోరూం నుంచి బండి బయటకు రాగానే వారికి నచ్చిన విధంగా మార్పులు చేసుకుంటున్నారు. ముఖ్యంగా బండ్లతో వచ్చిన సైలెన్సర్లను తొలగించి వాటిస్థానంలో ఎక్కువ శబ్దం వచ్చే వాటిని అమర్చుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలల వద్ద పెద్దగా శబ్దం చేస్తూ విద్యార్థులను, పాదచారులను డిస్టర్బ్ చేస్తున్నారు. బుల్లెట్ వాహనంపై ముగ్గురు వెళ్తూ బాంబులు పేలిన శబ్దాలు చేస్తున్నారు. దీంతో ప్రజలు ఎక్కడో బాంబు పేలిందని ఉలికిపడుతున్నారు. చిన్నచిన్న గల్లీల్లో కూడా బుల్లెట్ బండ్ల శబ్దాలు మరీ ఎక్కువగా వినిపిస్తున్నాయి. బుల్లెట్ ఇతర ద్విచక్రవాహనాలను వేగంగా నడుపుతూ.. మధ్యలో పవర్ బటన్ ఆఫ్ చేసి ఆన్ చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఇంజన్ ఆఫ్‌లోని వెళ్లి ఆన్‌లోకి రావడంతో సైలెన్సర్ నుంచి పెద్ద పేలుడు శబ్దం వినిపిస్తుంది. ఇలాంటి శబ్దాలకు ప్రజలు భయపడుతున్నారు. ఒక్కోసారి గుండె ఆగినంత పని అవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఆదేవిధంగా ఆటో, టాటా ట్రాలీల్లో సౌండ్ బాక్స్ పాటలతో జోరుగా వెళ్తున్నారు. మరికొందరు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నారు.

జిల్లాలోని 13,6110వాహనాలు..

జిల్లా వ్యాప్తంగా 13,6110 అన్ని రకాల వాహనాలు ఉన్నాయి. కాగా ర్యాష్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రంకెన్ డ్రైవ్, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్తే నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని ఆర్టీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పాయింట్ల విధానం ద్వారా చర్యలు తీసుకుంటున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌కు 3 నుంచి 5, ఓవర్ స్పీడ్‌కు 3 పాయింట్లు వేస్తున్నారు. 12 పాయింట్లు దాటితే మూడు నెలల నుంచి ఏడాది పాటు లైసెన్స్ రద్దు చేస్తారు. రెండోసారి 12పాయింట్లు దాటితే రెండేళ్ల పాటు లైసెన్స్ రద్దు, మూడోసారి జరిగితే మూడేళ్ల పాటు లైసెన్స్ రద్దు చేస్తున్నారు. లైసెన్స్ రద్దు చేశాక వాహనం నడిపితే మూడు నెలలు జైలు శిక్ష, బండిని సీజ్ చేసి చార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉంటుంది. లైసెన్స్ రద్దయ్యాక తిరి గి పొందడానికి 3 నెలల నుంచి ఏడాది సమయం పడుతుందని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

హద్దులు దాటొద్దు

మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధనలు అతిక్రమించొద్దు. వాహనదారులు హద్దులు దాటకుండా ఉంటేనే మంచిది. లేకుంటే లైసెన్స్ రద్దు తప్పనిసరి. వాహనాదారులు జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం.

– ఎం. వెంకన్న, ఎంవీఐ

గుండెజారినంత పనైంది..



ఇష్టానుసారంగా బుల్లెట్ బండ్లు నడుపుతూ బాంబులు పేలిన శబ్దం చేస్తున్నారు. దీంతో గుండెజారినంత పని అవుతోంది. అధికారులు, పోలీసులు అదుపు చేయాలి.

– పి. ఉషోద, చిరువ్యాపారి

కోడ్ వచ్చేస్తోంది..?

వారంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్?

- బీఆర్ఎస్ నేతలకు అధిష్టానం సంకేతాలు
- హడావుడిగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- ఇక అగ్రనేతల పర్యటనలు.. 6న మంత్రి కేటీఆర్



సాక్షిప్రతినిధి, వరంగల్: ఈ వారంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వస్తుందనే సంకేతాలు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అధిష్టానం నుంచి అందినట్లు ప్రచారం జరుగుతోంది. కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ సారథ్యంలో 17 మంది సభ్యుల బృందం మంగళవారం హైదరాబాద్‌కు చేరుకోవడం కూడా ప్రచారానికి బలం చేకూర్చుతోంది. దీంతో సర్వత్రా ఎన్నికల షెడ్యూల్‌పైనే చర్చ జరుగుతోంది.

దూకుడు పెంచిన ప్రజాప్రతినిధులు, పార్టీలు..

కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో కాలు మోపడంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. ఉమ్మడి వరంగల్‌లో అధికార బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు దూకుడు పెంచారు. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ అమల్లోకి రావచ్చన్న సంకేతాలతో ఓ అడుగు ముందుకేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు పెట్టుకుంటున్నారు. దీంతో మంత్రులతోపాటు ముఖ్యమంత్రి సహా అగ్రనేతల పర్యటనలతో జిల్లా హోరెత్తనుంది. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ నెల 6న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ గ్రేటర్ వరంగల్‌లో పర్యటించనున్నారు. హరీశ్‌రావు, కేసీఆర్ కార్యక్రమాలు కూడా ఉమ్మడి జిల్లాలో ఉండనున్నాయి. అలాగే కాంగ్రెస్, బీజేపీలు నియోజకవర్గాల్లో పర్యటనలు, కార్యక్రమాలను మంగళవారం నుంచి మరింత ముమ్మరం చేశాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకుని టికెట్ల కోసం ఎదురుచూస్తున్న ఆ రెండు పార్టీల అభ్యర్థుల జాబితా కూడా త్వరలోనే వెలువడనుందన్న ధీమాను పార్టీల నేతలు వ్యక్తం చేస్తున్నారు.

సర్వసన్నద్ధంగా అధికార యంత్రాంగం..

ఎప్పుడు ఎన్నికల షెడ్యూల్ వచ్చినా.. ఎన్నికలు జరిపే విధంగా ఉమ్మడి వరంగల్‌లోని 12 నియోజకవర్గాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు. సుమారుగా 27.89 లక్షల పైచిలుకు ఓటర్ల కోసం 3,252 పోలింగ్ కేంద్రాలు, 5,890ల వరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) సిద్ధం చేసినట్లు కూడా ప్రకటించారు. సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాల మార్కింగ్ చేశారు. జిల్లా కలెక్టరేట్లలో ఎన్నికల కేంద్రాలు, మీడియా సెంటర్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లతో పాటు ఎన్నికల సందర్భంగా అనుసరించాల్సిన విధానాలపై చర్చించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్‌కు చెందిన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లారు.

టోల్‌ప్లాజా ఏర్పాటు చేయొద్దు

- పురుగు మందు డబ్బాలతో వావిలాల రైతుల ఆందోళన



పురుగు మందు డబ్బాలతో ఆందోళన చేస్తున్న రైతులు

నెల్లికుదురు: తమ పంట పొలాల్లో టోల్‌ప్లాజా ఏర్పాటు చేయవద్దని రైతులు అంజిరెడ్డి, భూపాల్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, భూసాని శ్రీకాంత్‌రెడ్డి, జంపాల శ్రీకాంత్, సూరయ్య, చిర్ర వేణు ఆందోళనకు దిగిన ఘటన మండలంలోని వావిలాల గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ నుంచి భద్రాద్రి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి మంజూరు చేశారు. ఈ మేరకు అధికారులు సర్వేలు మొదలు పెట్టారు. కాగా వావిలాల శివారులో టోల్‌ప్లాజా ఏర్పాటు చేయాలని భావించిన అధికారులు భూ సర్వే చేస్తున్నారు. విషయం తెలుసుకున్న రైతులు తమ భూముల్లో టోల్‌ప్లాజా నిర్మాణం చేపడితే తమ బతుకులు రోడ్డుమీద పడుతాయన్నారు. పురుగు మందు డబ్బాలతో నెల్లికుదురు నుంచి మహబూబాబాద్ ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టారు. టోల్‌ప్లాజా నిర్మాణం వేరే చోట చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు.

శ్రమ లేకపోవడంతోనే రక్తపోటు

- డీఎంహెచ్ఓ అంబరీష



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ అంబరీష

మహబూబాబాద్: శారీరక శ్రమ లేకపోవడంతోనే డయాబెటిస్, రక్తపోటు, కేన్సర్ వంటి వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయని డీఎంహెచ్ఓ అంబరీష అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులు, హెల్త్ సూపర్‌వైజర్లకు ఎన్‌పీడీపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలిని బట్టి ఆహారపు అలవాట్లలో కూడా మార్పులు రావాలన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. వ్యాధి నిర్ధారణ చికిత్సతో పాటు సరైన చికిత్స అందించాలన్నారు. పదిరోజుల్లో ప్రతీ గ్రామంలో ఎన్‌పీడీ స్క్రీనింగ్‌ను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజ్‌కుమార్, సురేష్, డీడీఎం రాజ్‌కుమార్, డీఈఓ ఉమాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలి

తొర్రూరు: వ్యాధులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించాలని, అందుకు ఆశకార్యకర్తలు కృషి చేయాలని డీఎంహెచ్ఓ అంబరీష అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశకార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఆశ కార్యకర్తల పనితీరు బాగుంటేనే ప్రజారోగ్యం బాగుంటుందని తెలిపారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు టీకాలు, నెలవారీ పరీక్షలు, ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేలా ప్రజలను ప్రోత్సహించడంలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమన్నారు. వైద్యాధికారి మీరాజ్, డాక్టర్ మానస, ఆరోగ్య సిబ్బంది అన్నామేరీ, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పటిష్టంగా రూపొందించాలి



మాట్లాడుతున్న బాల మాయాదేవి

మహబూబాబాద్: ఓటరు జాబితాను పటిష్టంగా రూపొందించాలని ఓటరు జాబితా అబ్జర్వర్ బాల మాయాదేవి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ శశాంక అధ్యక్షతన ఓటరు జాబితా, తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. బాల మాయాదేవి మాట్లాడుతూ.. నేడు(బుధవారం) ఓటరు జాబితాను ప్రదర్శించాలన్నారు. జిల్లాలో 2018లో 4,12,896 మంది ఓటర్లు నమోదు కాగా.. ఈసారి 4,59,919 ఓటర్లు నమోదైనట్లు కలెక్టర్ శశాంక తెలియజేశారు.1,14,968 ఓటరు గు ర్తింపు కార్డులకు..25,450కార్డులు పంపిణీ చే శామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓ అలివేలు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రూట్లలో బస్సులు నడిపేందుకు కృషి

తొర్రూరు: అన్ని ప్రధాన రూట్లలో బస్సులు నడుపుతామని ఆర్టీసీ తొర్రూరు డీఎం పరిమళ తెలిపారు. తొర్రూరు నుంచి ఉప్పల్‌కు రెండు సూపర్ లగ్జరీ బస్సులను మంగళవారం డివిజన్ కేంద్రంలోని డిపోలో ప్రారంభించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ.. ప్రయాణికులు భద్రత, సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ రజిత, సిబ్బంది ఆర్ఎస్ కుమార్, జిలుకర యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌ ఉద్యోగుల నిర్లక్ష్యం..

- ప్రైవేట్‌ హెల్పర్‌కు కరెంట్‌ షాక్‌.. తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడిన కిరణ్‌

రఘునాథపల్లి: విద్యుత్‌ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ఓ ప్రైవేట్‌ హెల్పర్‌కు కరెంట్‌ షాక్‌ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని కంచనపల్లిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం మంగళవారం సాయంత్రం విద్యుత్‌ లైన్‌మెన్‌ సోమయ్య స్థానిక సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న జేఎల్‌ఎం వీరస్వామికి సమాచారం ఇచ్చి ఎల్‌సీ తీసుకుని గ్రామంలో విద్యుత్‌ మరమ్మతులు చేయిస్తున్నాడు. ప్రైవేట్‌ హెల్పర్‌ భాస్కుల్‌ కిరణ్‌తో బీసీ కాలనీలో పనులు చేయిస్తున్నారు. అయితే పని పూర్తికాకముందే సబ్‌స్టేషన్‌లోని జేఎల్‌ఎం లైన్‌ఆన్‌ చేయడంతో కిరణ్‌ కరెంట్‌ షాక్‌కు గురై తీగలపైనే తలకిందులై తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గుర్తించి సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి విద్యుత్‌ సరఫరా నిలిపివేశారు. తీవ్ర గాయాలైన కిరణ్‌ను కిందకు దింపి హుటాహుటిన జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌ తరలించారు. లైన్‌మెన్‌, జేఎల్‌ఎం నిర్లక్ష్యంపై స్థానికులు సబ్‌స్టేషన్‌ వద్ద ఆందోళన చేశారు. ఘటనపై ఏఈ రాహుల్‌ను వివరణ కోరగా ఘటనపై ఉన్నతాధికారులకు సమాచారమిచ్చామని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రమేష్‌(ఫైల్‌)

దామెర: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండల కేంద్రంలో జరిగింది. గ్రామానికి చెందిన వంగ రమేష్‌(35) తనకున్న ఎకరన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ సంవత్సరం పత్తిపంట సాగు కోసం, తన ఇద్దరి పిల్లల చదువు కోసం రూ.3 లక్షల 50 వేలు అప్పు చేశాడు. అయితే అప్పుకు వడ్డీ చెల్లించలేక, అప్పు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం ఉదయం తన వ్యవసాయబావి వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముత్యం రాజేందర్‌ తెలిపారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు!

- కేయూ విద్యార్థి జేఏసీ నాయకుల ఆరోపణ
- లిఖితపూర్వకంగా పోలీస్‌ కమిషనర్‌ దృష్టికి..
- మెరిట్‌ జాబితా వెబ్‌సైట్‌లో పెట్టాలని డిమాండ్‌


ఇష్టానుసారంగా..

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్ల రెండో కేటగిరీలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ప్రధానంగా వివిధ విభాగాల్లో పార్ట్‌టైం అభ్యర్థులకే ఎక్కువ సీట్లు ఇచ్చారని, రెగ్యులర్‌ అభ్యర్థులకు తక్కువ ఇచ్చారని విద్యార్థి జేఏసీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఏదేని విభాగంలో 25 శాతం పార్ట్‌టైం, 75 శాతం ఫుల్‌టైం అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అధికారులు బేఖాతర్‌ చేసినట్లు ఆరోపిస్తున్నారు. న్యాయ విచారణ జరిపించాలని కూడా కేయూ దూరవిద్య కేంద్ర ఆవరణలో నిరాహార దీక్షలు కొనసాగిస్తున్న విషయం విదితమే.

పోలీస్‌ కమిషనర్‌ దృష్టికి..

ఇటీవల విద్యార్థి జేఏసీ నాయకులతో సీపీ రంగనాథ్‌ సమావేశం నిర్వహించారు. ఇందులో పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. ఆరోపణలను లిఖితపూర్వకంగా రాసిస్తే వీసీ దృష్టికి తీసుకెళ్తానని సీపీ విద్యార్థి నాయకులకు సూచించారు. దీంతో పలు అంశాలను విద్యార్థి జేఏసీ నాయకులు కొన్ని పేజీల రిపోర్టులు సమర్పించారని సమాచారం. అందులో కొన్ని అంశాలను ఆరు రోజుల క్రితం కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్‌ ఇట్టబోయిన తిరుపతి యాదవ్‌ వెల్లడించారు. ఆ వివరాలు ఇవీ..

ఇష్టానుసారంగా..

పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లలో వీసీ తన ఇష్టానుసారంగా కొందరికి అడ్మిషన్లు వచ్చేలా వ్యవహరించారని, యూజీసీ నిబంధనలు మార్చుకుని డీఆర్‌సీని కాదని, ఒక కొత్త అడ్మిషన్‌ కమిటీని ఇంటర్వ్యూ కోసం వివిధ విభాగాలను తయారు చేసి, తాను ఆమోదించిన ఆ కమిటీలతో ఇంటర్వ్యూలు నిర్వహించారని సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నారు.

నిబంధనలకు విరుద్ధం..

కంప్యూటర్‌ సైన్స్‌ విభాగంలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో ఇంటర్వ్యూల్లో ఆ విభాగపు సూపర్‌వైజర్‌ను ఇంటర్నల్‌ ఎక్స్‌పర్ట్‌ కింద ఉంచలేదు. వేరే విభాగపు సూపర్‌వైజర్‌ను కమిటీలో ఉంచడం నిబంధనలకు విరుద్ధం. అంతేకాకుండా ఇద్దరూ వేరే యూనివర్సిటీ వాళ్లను ఎక్స్‌టర్నల్‌ ఎక్స్‌పర్ట్‌లుగా నియమించారు. మెరిట్‌ విద్యార్థులకు సీట్లు రాకుండా నష్టం చేశారని, పలు విభాగాల అడ్మిషన్‌ కమిటీ ఆర్డర్‌లను బయట పెడితే నిజాలు బయటపడతాయని, ఈ కమిటీ ఆర్డర్లను యూనివర్సిటీ గోప్యంగా ఉంచడంలో ఆంతర్యమేంటని లేఖలో ప్రశ్నించారు.

ఈడబ్ల్యూఎస్‌ కోటా ఎలా వచ్చింది?

అభ్యర్థులు అప్లికేషన్‌ నింపేటప్పుడు లేని ఈడబ్ల్యూఎస్‌ కోటా ఇంటర్వ్యూలో ఎలా రప్పించారని సీపీకి అందించిన లేఖలో విద్యార్థులు ప్రశ్నించారు. బయోటెక్నాలజీ విభాగంలో, బీసీ కేటగిరీ కింద ఓ మహిళా అభ్యర్థికి 51, మరో మహిళకు 46, మరొకరికి 44 మార్కులు వచ్చాయి. వీరిలో ఎవ్వరినీ ఎంపిక చేయకుండా 43 మార్కులు ఉన్న మరో మహిళా అభ్యర్థిని ఎలా ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఎలక్ట్రానిక్స్‌, కమ్యూనికేషన్‌ ఇంజనీరింగ్‌ డిపార్ట్‌మెంట్‌లో బీసీ-బీ కేటగిరీ కింద 65 మార్కులతో రెండో టాపర్‌ ఏ మహిళా అభ్యర్థిని కాదని, 52 మార్కులతో పురుష అభ్యర్థిని ఎంపిక చేశారని లేఖలో నిలదీశారు. ఇంకా పలు అంశాలను సీపీకి అందించిన లేఖలో పేర్కొన్నట్లు, ప్రవేశ పరీక్ష మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల మెరిట్‌ జాబితాను పేర్లతో సహా.. వెబ్‌ సైట్‌లో పొందుపర్చాలని కోరినట్లు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ చైర్మన్‌ ఇట్టబోయిన తిరుపతి యాదవ్‌ తెలిపారు.

సై అంటే.. సై



పతకాలు సాధించిన క్రీడాకారులతో విద్యుత్‌ శాఖ అధికారులు

- హోరాహోరీగా విద్యుత్‌ ఉద్యోగుల క్రీడలు
- తమిళనాడు అథ్లెట్ల హవా
- మొదటిరోజు పోటీలు ఉత్కంఠ

హన్మకొండ: ఆల్‌ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డ్‌ అథ్లెటిక్స్‌, బాల్‌బ్యాడ్మింటన్‌ చాంపియన్‌షిప్‌ కోసం విద్యుత్‌ ఉద్యోగుల మధ్య పోరు హోరాహోరీగా కొనసాగుతోంది. తెలంగాణ ట్రాన్స్‌కో అండ్‌ డిస్కమ్స్‌ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియంలో ప్రారంభమైన క్రీడా పోటీలు మంగళవారం ఉత్కంఠగా కొనసాగాయి. టీఎస్‌ఎన్పీడీసీఎల్‌ హెచ్‌ఆర్‌డీ డైరెక్టర్‌ వెంకటేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మొదటి రోజు విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. 200, 800 మీటర్ల రన్నింగ్‌, హ్యామర్‌త్రో, షాట్‌పుట్‌, 400 మీటర్ల హార్డిల్స్‌, లాంగ్‌జంప్‌తో పాటు బాల్‌బ్యాడ్మింటన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు తలపడ్డారు. తమిళనాడు క్రీడాకారులు అథ్లెటిక్స్‌లో దూసుకుపోతూ గోల్డ్‌, సిల్వర్‌, బ్రాంజ్‌ మెడల్స్‌ సాధించి ముందంజలో ఉన్నారు. బాల్‌ బాడ్మింటన్‌ క్రీడలు లీగ్‌ దశలో కొనసాగుతున్నాయని టీఎస్‌ ట్రాన్స్‌కో క్రీడల అధికారి జగన్నాథ్‌ తెలిపారు. క్రీడా పోటీల్లో తెలంగాణ ట్రాన్స్‌కో అండ్‌ డిస్కమ్స్‌, ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్‌ సంస్థ, కేరళ ఎలక్ట్రిసిటీ బోర్డ్‌, తమిళనాడు ఎలక్ట్రిసిటీ, ఉత్తర్‌ప్రదేశ్‌ పవర్‌ సెక్టార్ల నుంచి 12 జట్లు, 160 మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల్‌ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్‌ కంట్రోల్‌ బోర్డ్‌ సీనియర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ కుమార్‌వడివేలు, వరంగల్‌ స్పోర్ట్స్‌ కౌన్సిల్‌ ప్రధాన కార్యదర్శి జాన్సన్‌, కౌన్సిల్‌ సభ్యులు పి రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొదటి రోజు విజేతలు..

200 మీటర్ల రన్నింగ్‌
బాలాజీ (గోల్డ్‌) ఏపీ, దినేష్‌(సిల్వర్‌) తమిళనాడు, రాజేష్‌(బ్రాంజ్‌) కేరళ.

800 మీటర్ల రన్నింగ్‌ ..
నాగులు(గోల్డ్‌) ఏపీ, సుందర్‌(సిల్వర్‌) తమిళనాడు, బాబు(బ్రాంజ్‌) తమిళనాడు.

400 మీటర్ల హార్డిల్స్‌
బాలమురుగన్‌(గోల్డ్‌) తమిళనాడు, యువరాజ్‌(సిల్వర్‌) తమిళనాడు, సతీష్‌(బ్రాంజ్‌)ఏపీ.

హ్యామర్‌త్రో
పాండ్యన్‌(గోల్డ్‌) తమిళనాడు, విజయ్‌కుమార్‌ (సిల్వర్‌) ఉత్తర్‌ప్రదేశ్‌, శ్రవణ్‌కుమార్‌ (బ్రాంజ్‌) ఉత్తర్‌ప్రదేశ్‌.

షాట్‌పుట్‌
శ్రీనివాస్‌(గోల్డ్‌) ఏపీ, రాజేశ్‌కుమార్‌(సిల్వర్‌) కేరళ, ముఖేష్‌(బ్రాంజ్‌) తమిళనాడు.

లాంగ్‌జంప్‌
రాజేష్‌(గోల్డ్‌) కేరళ, దినేష్‌(సిల్వర్‌) తెలంగాణ, విజయ్‌కుమార్‌(బ్రాంజ్‌) తమిళనాడు.

విద్యుత్‌ సమస్యల పరిష్కారానికి లోకల్‌ కోర్టు



హన్మకొండ: విద్యుత్‌ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్‌ కోర్టు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ ఎస్‌.వి.వేణుగోపాలచారి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లోకల్‌ కోర్టు నిర్వహిస్తామని, వినియోగదారులు ఈ కోర్టులో ఫిర్యాదు చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 4న తొర్రూరు డివిజన్‌ నెల్లికుదురు సెక్షన్‌ కార్యాలయంలో లోకల్‌ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో దంతాలపల్లి, మునగలవీడు, నెల్లికుదురు సెక్షన్‌ కార్యాలయ పరిధిలోని వినియోగదారులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. నర్సంపేట డివిజన్‌ చెన్నారావుపేట విద్యుత్‌ సబ్‌ స్టేషన్‌లో ఈ నెల 5న లోకల్‌ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో అలంఖానీపేట, చెన్నారావు పేట, నెక్కొండ సెక్షన్‌ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదు చేయొచ్చని తెలి పారు. ఈ నెల 12న ములుగు డివిజన్‌ వాజేడు సబ్‌ స్టేషన్‌లో నిర్వహించే లోకల్‌ కోర్టు ద్వారా ఎస్‌.వి.పురం, వాజేడు, ఈ నెల 13న జనగామ డివిజన్‌ రఘునాథపల్లి సబ్‌ స్టేషన్‌లో నిర్వహించే లోకల్‌ కోర్టులో నర్మెట, ఖిలాషాపూర్‌, రఘునాథపల్లి, తరిగొప్పుల సెక్షన్‌ కార్యాలయాల పరిధిలోని విద్యుత్‌ వినియోగదారులు తమ ఫిర్యాదులు అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని సీజీఆర్‌ఎఫ్‌ చైర్మన్‌ ఎస్‌.వి.వేణుగోపాలచారి కోరారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం..

- భూమి చుట్టూ కంచె ఏర్పాటుకు నిర్ణయం
- కబ్జాదారులపై క్రిమినల్‌ చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్‌..

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భూమి కబ్జా అంశాన్ని అధికారులు సీరియస్‌గా పరిగణించారు. 'సర్కార్‌ భూమి స్వాహా' అనే శీర్షికతో సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు సొసైటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు ఆదేశాల మేరకు ఆ శాఖ అధికారులు కబ్జాకు గురైన భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏ మేరకు భూమి కబ్జాకు గురైందని చైర్మన్‌ రాజేష్‌ను అడిగి తెలుసుకున్నారు. 2022 జనవరిలో రెండెకరాల భూమిని సొసైటీకి కేటాయించిన పత్రాలను అధికారులకు చూపించారు. కొంతమంది కబ్జాదారులు సొసైటీ భూమిలోకి ఆక్రమించారని వివరించారు. బడా లీడర్ల హస్తంతో భూమి కబ్జాకు గురైనట్లు స్థానికులు అధికారులకు చెప్పారు.


కబ్జాకు గురైన భూమిని పరిశీలిస్తున్న సొసైటీ అధికారులు

భూమి చుట్టూ కంచె ఏర్పాటు

కాగా, సొసైటీకి కేటాయించిన రెండెకరాల భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు పాలక వర్గానికి సూచించారు. సొసైటీ నిధులు వెచ్చించాలని చెప్పారు. ఇదిలా ఉండగా, కబ్జాదారులపై క్రిమినల్‌ చర్యలకు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


సతీష్‌(ఫైల్‌)

భూపాలపల్లి అర్బన్‌: ద్విచక్రవాహనం అదుపు తప్పి కల్వర్ట్‌కు ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి వేశాలపల్లి గ్రామ సమీపంలో జరిగింది. వేషాలపల్లి గ్రామ శివారులోని డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లలో నివాసముంటున్న బైరి సతీష్‌ (34) సోమవారం రాత్రి ద్విచక్రవాహనంపై భూపాలపల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో గ్రామ సమీపంలోని కల్వర్ట్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటపై మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రవణ్‌కుమార్‌ తెలిపారు.

కేయూలో బంద్‌ ప్రశాంతం..

- పరిపాలనాభవనం వద్ద విద్యార్థుల ధర్నా
- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌ రెడ్డి దిష్టిబొమ్మ దహనం


పరిపాలనా భవనం వద్ద ధర్నా చేస్తున్న జేఏసీ నాయకులు, విద్యార్థులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వీసీ తాటికొండ రమేష్‌, రిజిస్ట్రార్‌ టి శ్రీనివాస్‌రావును బర్తరఫ్‌ చేయాలని డిమాండ్‌ చేస్తూ విద్యార్థి జేఏసీ ఇచ్చిన కాకతీయ యూనివర్సిటీ బంద్‌ మంగళవారం ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు క్యాంపస్‌లోని వివిధ కళాశాలలు, విభాగాలు తిరుగుతూ తరగతి గదుల్లోని విద్యార్థులను బయటకు పంపారు. అలాగే, ఉద్యోగులను కూడా పంపారు. దీంతో కేయూలో పాలన స్తంభించింది. అనంతరం వివిధ విభాగాల విద్యార్థులతో కలిసి ర్యాలీగా పరిపాలనాభవనం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై ప్రశ్నించిన విద్యార్థులను పోలీసులతో కొట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై తాము 46 పేజీల బుక్‌లెట్‌ విడుదల చేశామన్నారు. ఇప్పటికే పలు అంశాలను వరంగల్‌ పోలీస్‌కమిషనర్‌ దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. వాటిపై వీసీ, రిజిస్ట్రార్లు బహిరంగ చర్చకు రావడం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కేయూ విద్యార్థి జేఏసీ చైర్మన్‌ తిరుపతి యాదవ్‌, నేతలు మందవీరస్వామి, రంజిత్‌కుమార్‌, రాంబాబు, మనోహర్‌, నాగరాజు, శంకర్‌, పాషా, రాజేష్‌, ప్రశాంత్‌, జగన్‌, రమేష్‌, విజయ్‌, రాజునాయక్‌, ప్రసాద్‌, సాయిరాం, మనోజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

- ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి అశోక్‌ ఓంకార్‌


మాట్లాడుతున్న అశోక్‌

వరంగల్‌ చౌరస్తా : వర్గ, సామాజిక, జమిలి పోరాటాలను ఉధృతం చేయడమే అమరులకు ఇచ్చే ఘన నివాళి అని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ ఓంకార్‌ అన్నారు. మంగళవారం దివంగత పరికరాల భూమయ్య, పిట్ట వెంకటయ్య, సింగిరెడ్డి కొంరయ్య సంస్మరణ సభ పార్టీ వరంగల్‌ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్‌ అధ్యక్షతన వరంగల్‌ శివనగర్‌లోని ఓంకార్‌ భవన్‌లో జరిగింది. ఈ సంస్మరణ సభకు అశోక్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పరికరాల భూమయ్య ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రాష్ట్ర నాయకుడిగా, నేరేడుపల్లి ఎంపీటీసీగా పని చేశారన్నారు. చనిపోయే వరకు నిరంతరం ప్రజాసమస్యలపై పోరాడిన వ్యక్తి భూమయ్య అన్నారు. కార్మిక నాయకుడిగా పిట్ట వెంకటయ్య, రైతు ఉద్యమ నాయకుడిగా సింగిరెడ్డి కొంరయ్య సేవలు మరవలేనిన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వల్లెపు ఉపేందర్‌ రెడ్డి, వనం సుధాకర్‌, సుకన్య, గోనె కుమారస్వామి, ఎన్‌ రెడ్డి హంసా రెడ్డి, తుకారాం నాయక్‌, మంద రవి, గడ్డం నాగార్జునా, నర్ర ప్రతాప్‌, జబ్బార్‌ నాయక్‌, శ్రీనివాస్‌, వంగల రాగసుధ, నీల రవీందర్‌, మాస్‌ సావిత్రి, కర్ర రాజిరెడ్డి, కుసుంబ బాపురావు, గుండెబోయిన చంద్రయ్య, నాగెల్లి కొమరయ్య, గాదె మల్లేష్‌ ,కంచ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు సముచిత స్థానమివ్వాలి

- ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతల డిమాండ్‌


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ విద్యార్థి ఉద్యమ నేతలు

కేయూ క్యాంపస్‌ : 'తెలంగాణ రాష్ట్ర సాధనలో అప్పటి టీఆర్‌ఎస్వీ, ఇప్పటి బీఆర్‌ఎస్వీ విద్యార్థి నేతలు కీలక పాత్ర పోషించి అనేక కేసుల పాలై జైళ్లకు వెళ్లాం.. కానీ రాష్ట్రం సాధించిన అనంతరం తమకు ఎలాంటి గుర్తింపు లభించడం లేదని, మాపై చిన్న చూపు ఎందుకంటూ' ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్వీ ఉద్యమ నేతలు ప్రశ్నించారు. ఈ మేరకు మంగళవారం కేయూలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. చట్టసభలు, పదవులు, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో ఎందులో కూడా కాకతీయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థి ఉద్యమ నేతలకు సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్‌, జెడ్పీటీసీ, ఇతర జిల్లా స్థాయి పదవుల్లో కూడా అవకాశం కల్పించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా తమ సేవలను గుర్తించి వివిధ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమ నేతలు డాక్టర్‌ పాలకుల కొమురయ్య, కందుకూరి ప్రభాకర్‌, మాచర్ల శరత్‌చంద్ర, జెట్టి రాజేందర్‌, మేడారపు సుధాకర్‌, అరూరి రంజిత్‌, కె. అభినాష్‌, రాజీమనోజ్‌, నాగరాజు, నగేష్‌, లక్ష్మణ్‌గౌడ్‌, సుమన్‌రెడ్డి, మోటె చిరంజీవి, విష్ణువర్ధన్‌, సాయిళ్ల రాజు, నీల అశోక్‌, రమేష్‌, తిరుపతి, క్రాంతికుమార్‌, ఎన్‌. సతీష్‌, తదితరులు పాల్గొన్నారు.

ప్రీ రిపబ్లిక్‌ పరేడ్‌కు ఎంపికలు


రిపబ్లిక్‌ పరేడ్‌కు ఎంపిక చేస్తున్న అధికారులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథం (ఎన్‌ఎస్‌ఎస్‌) కార్యాలయంలో మంగళవారం ప్రీ రిపబ్లిక్‌ పరేడ్‌ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు హైదరాబాద్‌ నుంచి ఎన్‌ఎస్‌ఎస్‌ హైదరాబాద్‌ రీజినల్‌ డైరెక్టర్‌ రామకృష్ణ, స్టేట్‌ ఎన్‌ఎస్‌ఎస్‌ ఆఫీస్‌ డిప్యూటీ ఎస్‌వో గీత, మరో అధికారి సంజయ్‌ హాజరయ్యారు. ప్రీ పరేడ్‌కు యూనివర్సిటీ పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లలో ఐదుగురు బాలికలను ఎంపిక చేసినట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్‌కోఆర్డినేటర్‌ ఈసం నారాయణ తెలిపారు. వీరు వచ్చే ఏడాది జనవరి 26న న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌ పరేడ్‌లో పాల్గొంటారని తెలిపారు.

గ్రామ రాజకీయాలకు దూరంగా ఉండాలి

- దేవాదాయధర్మాదాయశాఖ వరంగల్‌ జోన్‌ ఉపకమిషనర్‌ శ్రీకాంతారావు
- ముగిసిన డీడీఎన్‌ అర్చకుల శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న శ్రీకాంతారావు

హన్మకొండ కల్చరల్‌ : అర్చకులు గ్రామరాజకీయాలకు దూరంగా ఉంటూ వేదధర్మం అనుసరిస్తూ ముందుకు సాగాలని, సిబ్బందితో ప్రతి మండలం, గ్రామంలో వెరిఫికేషన్‌ బృందాలు ఏర్పాటు చేస్తామని దేవాదాయశాఖ వరంగల్‌ జోన్‌ ఉప కమిషనర్‌ టి. శ్రీకాంతారావు తెలిపారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థాన కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్‌ జిల్లాల దూపదీప నైవేద్య (డీడీఎన్‌)అర్చకులకు ఏర్పాటు చేసిన పునశ్చరణ తరగతులు ముగిశాయి. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన ముగింపు సమావేశంలో శ్రీకాంతారావు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో డీడీఎన్‌ అర్చకులు దేవాలయాల తాళాలు తీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్చకులు రోజూ ఉదయం వారి దేవాలయాల నుంచి లోకేషన్‌ షేర్‌ చేయాలని, దీనికోసం ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు వేదపండితుల ఆధ్వర్యంలో శైవ, వీరశైవ, స్మార్థ, పాంచరాత్ర, చాత్తాదవైష్ణవ, వైఖానస, గ్రామదేవత, తంత్రసార తదితర ఎనిమిది ఆగమాలలో అర్చకులకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ వరంగల్‌ అసిస్టెంట్‌ కమిషనర్లు రామల సునీత, శేషుభారతి, సిబ్బంది వీరస్వామి, కవిత, సంజీవరెడ్డి, అనిల్‌కుమార్‌, అర్చక బోర్డు సభ్యులు చిలకమర్రి శ్రవణకుమార్‌చార్యులు, కృష్ణమాచారి, వేద పండితులు రామశర్మ, లంకాశివకుమార్‌శర్మ, పార్థసారథి, రత్నాకర్‌, రాఘవాచారి పాల్గొన్నారు.

మిగిలిన సీట్ల కోసం వాక్‌ఇన్‌ అడ్మిషన్లు

వరంగల్‌ : రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వరంగల్‌ ఐటీఐ ప్రిన్సిపాల్‌, కన్వీనర్‌ జుమ్లానాయక్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2023 సెషన్‌ కోసం ఎన్‌సీవీటీ పద్ధతిలో వివిధ ఇంజనీరింగ్‌, నాన్‌ ఇంజనీరింగ్‌ ట్రేడ్లలో శిక్షణ పొందడానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ ఐటీఐల్లో నాలుగు విడతల్లో జరిగిన కౌన్సింగ్‌లో మిగిలిన సీట్ల కోసం 5వ విడత వాక్‌ఇన్‌ అడ్మిషన్ల కోసం www.iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ విడత వాక్‌ఇన్‌ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్‌కు ఈనెల 8 చివరి తేదీ అని తెలిపారు. ఆన్‌లైన్‌లో మెరిట్‌ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామన్నారు. ఈ వాక్‌ ఇన్‌ ఇంటర్వ్యూలను ఈనెల 9వ తేదీన ములుగు రోడ్డు సమీపంలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.